29న భారీ బైక్‌ర్యాలీ

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



కార్పొరేటర్లు, ముఖ్యనాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: బీఆర్‌ఎస్ దీక్షాదివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ నెల 29 న సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారీ బైక్ ర్యాలీని నిర్వహించ నున్నట్లు ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను బలీయమైన శక్తిగా తీర్చి దిద్దామని తెలిపారు. తెలంగాణ ఉద్యమం ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా ఉంటున్న ఇక్కడి కార్యకర్తలు మళ్లీ పార్టీని అధికారంలోకి తెచ్చేవరకు తమ వంతు కృషి చేయాలన్నారు. తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో దీక్షా దివస్‌కు అత్యంత ప్రాముఖ్యత ఉందని తెలిపారు. నియోజకవర్గంలోని అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ మున్సిపల్ డివిజన్ల నుంచి డివిజన్‌కు 250 బైక్‌ల చొప్పున మొత్తంగా 1250 మందితో తెలంగాణ భవన్ వరకు బైక్‌ర్యాలీ సాగుతుందన్నారు. బైక్‌ర్యాలీతోపాటు వివిధ మార్గాల ద్వారా నియోజకవర్గ కార్యకర్తలు తరలి రావాలని చెప్పారు. సమావేశంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మి, రాసూరి సునీత, బీఆర్‌ఎస్ నేతలు ఆలకుంట హరి, సుంకు రాంచందర్, కంది నారాయణ, లింగాని శ్రీనివాస్, సునీల్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



షాపు నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఈ వెంకటేష్

అడ్డగుట్ట: షాపులకు సంబంధించిన వ్యర్థాలను రోడ్డుపై వేస్తే జరిమానా విధిస్తామని శానిటేషన్ డీఈ వెంకటేష్ హెచ్చరించారు. బుధవారం అడ్డగుట్ట డివిజన్‌లోని ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న షాపుల వద్ద జీహెచ్‌ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ వెంకటేష్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత షాపుల నిర్వాహకులపై ఉందన్నారు. అందులో భాగంగా టీ స్టాల్, పాన్ షాపు, కిరాణా షాపులతో పాటు ఇతర చిరువ్యాపారాలు సాగించే షాపుల వద్ద పరిసరాలను పరిశీలించినట్లు తెలిపారు. షాపు నిర్వాహకులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం లేదని, పలువురు కనీసం చెత్త బుట్ట కూడా ఏర్పాటు చేసుకోని కారణంగా షాపులకు వచ్చే కస్టమర్లు వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారన్నారు. తద్వారా పరిసరాలు అధ్వానంగా, అపరిశుభ్రంగా మారుతున్నాయన్నారు. తమ షాపులకు సంబంధించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంటుందని, ఇకపై పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో జీహెచ్‌ఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిబ్బంది, ఎస్‌ఎఫ్‌ఏ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్



కవాడిగూడ: రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డా.బీఆర్.అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ ఆమోదిత దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో బహుజన సంఘాల పాత్ర, పౌరులు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన భారత రాజ్యాంగం పట్ల సమాజంలో సగం మందికి అవగాహన లేకపోవడం విచారకరమని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో అనగారిన వర్గాల ఆకాంక్షలు నెరవేరే విధంగా అనేక సెక్షన్లు పొందుపరిచారని తెలిపారు. అనంతరం 'దళితులకు రాజ్యాధికారం ఎండమావేనా.?'అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు సుదర్శన్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు రాగాల నాగేశ్వర్‌రావు, ఎస్ నర్సింహారావు, ప్రొ. ఏకు తిరుపతి, కృష్ణవేణి, గుంటి విజయ్‌బాబు, రాడపాక పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రావు మరణం కార్మిక లోకానికి తీరనిలోటు



గోపాల్‌రావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి

కాచిగూడ: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ నేత, కార్మికనాయకుడు, మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్‌రావు మరణం కార్మిక లోకానికి తీరని లోటు అని చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం కాచిగూడ, నింబోలిఅడ్డలో గోపాల్‌రావు పార్థివదేహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం జరిగిన ఆయన అంత్యక్రియల్లో వివేక్ పాల్గొని సంతాపం ప్రకటించారు. గోపాల్‌రావు తన తండ్రి వెంకటస్వామితో కలిసి కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్నారని ఆయన గుర్తు చేశారు. అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం గోపాల్‌రావు చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంత్యక్రియలు హరాస్‌పెంటలోని హిందూ శ్మశానవాటికలో నిర్వహించారు. ఆయన అంత్యక్రియల్లో సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, సి.నందకిషోర్ యాదవ్, లక్ష్మణ్‌రావు, కృష్ణాగౌడ్, విజయ్‌కుమార్, డాక్టర్ కొండా శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రావు మరణం పట్ల గవర్నర్ సంతాపం

కాచిగూడ: మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్‌రావు మరణం పట్ల హర్యాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ బుధవారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఈ కష్టకాలంలో బాధను తట్టుకోవడానికి వారి కటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు బండారు దత్తాత్రేయ తెలియజేశారు.

న్యూరామాలయంలో కార్తీక దీపోత్సవం



ఆలయ ప్రాంగణంలో లింగాకారంలో సహస్ర దీపాల అలంకరణ

నల్లకుంట: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని న్యూ నల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు లింగాకారంలో సహస్ర దీపాలు వెలిగించారు. అంతకు ముందు అక్కడి పర్వత వర్ధిని రామలింగేశ్వర ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. ఈ వేడుకల్లో నల్లకుంట కార్పొరేటర్ అమృత, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు, సభ్యులు ఎస్. వెంకటేశ్వరరావు, మధుకుమార్, వై. మురళి మధుసూదన్, మురళీకృష్ణ, మంజులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రేపు శివపార్వతుల కల్యాణం..

కార్తీక మాసం ముగింపుని పురస్కరించుకొని శుక్రవారం (రేపు) సాయంత్రం 6.30 గంటలకు న్యూరామాలయం ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం ఉంటుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు చెప్పారు. అనంతరం తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. కల్యాణంలో పాల్గొనాలనుకునే భక్తులు వివరాలకు ఆలయ గుమస్తా, అర్చక స్వామిని సంప్రదించాలని కోరారు.

విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలి

లిబర్టీ: ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తమ్‌ను జర్నలిస్టు యూనియన్ ప్రతినిధి బృందం కలిసింది. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రాజేష్ హైదరాబాద్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు శంకర్‌గౌడ్ ప్రొఫెసర్ పురుషోత్తమ్‌ను శాలువాతో ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలని, అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని విన్నవించారు.

బీఆర్‌ఎస్ 'దీక్షా దివస్'కు భారీగా తరలిరండి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: తెలంగాణ భవన్‌లో ఈ నెల 29వ తేదీన నిర్వహించే దీక్షా దివస్‌కు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర సాధకుడు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని కీలక మలుపుతిప్పిందని పేర్కొన్నారు. 29వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్‌లపై బేగంపేటలోని పాటిగడ్డలో గల మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకోవాలని చెప్పారు. సుమారు మూడు వేల బైక్‌లతో ర్యాలీగా బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ సర్కిల్ వద్దకు చేరుకుంటామని పేర్కొన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా తెలంగాణ భవన్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, శ్రీహరి, పవన్‌కుమార్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, మల్లికార్జున్‌గౌడ్, తలసాని స్కైలాబ్‌యాదవ్ పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

పద్మారావునగర్: తెలంగాణ భవన్‌లో ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పద్మారావు నగర్ ఇన్‌చార్జీ జి. పవన్‌కుమార్ గౌడ్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం పద్మారావునగర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న పద్మారావునగర్ నుంచి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 29న రసూల్‌పుర చౌరస్తా నుంచి తెలంగాణ భవన్ వరకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

శివుడికి ప్రత్యేక అభిషేకం



అరటిపండ్ల అలంకరణలో మల్లికార్జునుడు..

సనత్‌నగర్: కార్తీక మాస పూజోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. సనత్‌నగర్ శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు కొనసాగుతున్నాయి. విశేష అలంకరణలతో స్వామివారు భక్తులను ఆకట్టుకుంటున్నారు. బుధవారం అరటిపండ్లతో అందంగా అలంకరించిన తీరు భక్తులను కనువిందు చేసింది. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో కార్తీక మాస పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

సన్మానం



మాచారావును సన్మానిస్తున్న మోడల్‌కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

సనత్‌నగర్: సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న సుందర్‌నగర్ అధ్యక్షుడు మీనవల్లి మాచారావును మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి తదితరులు ఆయనను సన్మానించి అభినందన పత్రాన్ని అందజేశారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గంలో రాష్ట్ర నేతలకు చోటు



జీవన్- ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: ఏబీవీపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీల కన్వీనర్ జీవన్‌కు చోటు దక్కింది. యూపీలోని గోరఖ్‌పూర్‌లో జరుగుతున్న ఏబీవీపీ 70 జాతీయ మహాసభల్లో జీవన్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఓయూలో పీహెచ్‌డీ చేస్తున్న జీవన్ డిగ్రీ నుంచి ఏబీవీపీలో పని చేస్తూ విద్యార్థి సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. రాష్ట్ర స్థాయిలో వివిధ పదవులను చేపట్టిన జీవన్ జాతీయ కార్యవర్గంలో చోటు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశాడు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

వెంగళరావునగర్: వెంగళరావునగర్‌కాలనీలో బుధవారం అయ్యప్ప మహా పడి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప పూజ సందర్భంగా సీ-టైపు క్వార్టర్స్‌లో అయ్యప్పస్వామి నామస్మరణతో మార్మోగింది. కిషన్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహా పడిపూజకు కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీ.వీ.రవిశేఖర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ గురుస్వామి ఆయనను ఘనంగా సన్మానించారు. మహా పడిపూజలో ప్రశాంత్ స్వామి, కిశోర్ స్వామి, రంగారావు స్వామి, రమణస్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



రాంగోపాల్‌పేట్: జేమ్స్ స్ట్రీట్, కిమ్స్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 28న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పీజీరోడ్ ఫీడర్ పరిధిలోని వెస్లీ జూనియర్ కాలేజ్, జవహర్‌నగర్‌కాలనీ, పార్శీ కాంపౌండ్, కరీం కాంపౌండ్, ఎఫ్ క్లాస్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎస్పీరోడ్ ఫీడర్ పరిధిలోని నవకేతన్ కాంప్లెక్స్, మీ సేవా, మారుతీవీధి, రజాదీన్‌దయాల్, కార్పొరేషన్, కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్ ఫేర్ ప్రాంతాల్లో అలాగేసాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు హెచ్‌డీఎఫ్ ఫీడర్ పరిధిలోని హెచ్‌డీఎఫ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సనత్‌నగర్: కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమృత మాల్, జీఎస్ మాల్, ఐసీఐసీఐ బ్యాంక్, జయగార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

పాఠశాలలో సౌకర్యాలు కల్పించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్‌ను కలిసిన ఆయన వినతిపత్రం అందించారు. పాఠశాలకు సరైన దారిలేదని, పాఠశాల భవనం తూర్పు వైపు గేట్ పెట్టించి కొత్త దారిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పాఠశాలకు దారి ఏర్పాటు చేయించడంతోపాటు, మౌళిక వసతులు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద కుటుంబాలకు చెందిన పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత,జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇ. చంద్రశేఖర్, బ్రహ్మానందం, విట్‌సన్ సంస్థ నిర్వాహకుడు సుంకు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

బంజారాహిల్స్: అంబేడ్కర్ విశ్వవిద్యాలయ స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) చైర్‌పర్సన్ పల్లవీ కాంబ్లే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల భూమిని కాపాడటానికి గత 69 రోజులుగా జేఏసీ సభ్యులు, ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేవరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ఎల్వీకేరెడ్డి, మేరీ సునంద, రజనీ, యాకేష్ దైద, ఉదయిని, హబీబుద్దీన్, కిషోర్, రాఘవేంద్ర, అంబేడ్కర్, రజిత, పాండు, షబ్బీర్, రాములు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైం స్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్

అంబర్‌పేట: ఫుట్‌పాత్ ఆక్రమణలు, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై ట్రాఫిక్ అధికారులు కొరడా ఝుళిపించారు. అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఆలీ కేఫ్ చౌరస్తా నుంచి జిందా తిలస్మాత్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాదారులపై కేసులు నమోదు చేసి అడ్డుగా ఉన్నవాటిని తొలగించారు. ట్రాఫిక్ డీసీపీ ఎన్.అశోక్ కుమార్, ఏసీపీ సంపత్‌కుమార్ పర్యవేక్షణలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది రోడ్డుపై ఉన్న అడ్డంకులను తొలగించారు.

◆ అంబర్‌పేటలో ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు ఉండటంతో ప్రత్యామ్నాయ రోడ్డుగా ఆలీకేఫ్ చౌరస్తా, జిందా తిలస్మాత్ రోడ్డు మీదుగా గోల్నాక కొత్త బ్రిడ్జిపైకి నిత్యం వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్వహిస్తున్న డబ్బాలను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు ఫుట్ ఆక్రమణల తొలగింపు చర్యలను చేపట్టారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

ఒడిస్సా నుంచి గంజాయి తెచ్చి నగరంలో విక్రయాలు



గంజాయి విక్రేత సంతోష్‌కుమార్

బంజారాహిల్స్: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తితో పాటు కొనుగోలు చేసిన ఏడుగురిని బంజారాహిల్స్ పోలీసులతో కలిసి వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిస్సాకు చెందిన సంతోష్‌కుమార్‌రౌత్ (25) జీవనోపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని నందినగర్‌లో ఉంటున్నాడు. గతంలో సెక్యూరిటీ గార్డ్‌గా, స్విగ్గీ డెలివరీ ఏజెంట్‌గా పనిచేశాడు. అయితే జీవనం గడిపేందుకు డబ్బులు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే నిర్ణయానికి వచ్చాడు. ఈ క్రమంలోనే సంతోష్‌కుమార్‌కు ఒడిస్సా రాష్ట్రం ఫుల్బానీ జిల్లాకు చెందిన గోవింద్‌తో పరిచయం ఏర్పడింది. గోవింద్ వద్ద నుంచి సంతోష్ సుమారు 9 కేజీల గంజాయిని కొనుగోలు చేసి ఒడిస్సా రాష్ట్రం నుంచి రైలులో తరలించి బంజారాహిల్స్‌కు తెచ్చాడు. ఆ తరువాత చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసి అవసరమైన వినియోగదారులకు విక్రయించి డబ్బు సంపాదిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ జంగయ్య నేతృత్వంలో ఎస్‌ఐ అరవింద్‌గౌడ్ సిబ్బంది దాడులు జరిపి సంతోష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయి కొనుగోలు చేసిన మరో ఏడుగురిని కూడా అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 9 కిలోల ఎండు గంజాయి, బైక్, రెండు మొబైల్ ఫోన్లు, తూకం వేసే యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో...) టమాటా.41, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 33, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 26, పందిరి బీర 52, క్యాబేజీ 23, క్యారెట్ 55, దొండ 35, గుండుబీన్స్ 47, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 35, బీట్‌రూట్ 47, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 40, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 8, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బీఆర్‌ఎస్వీ నాయకులను విడుదల చేయాలి



డా.వేల్పుకొండ వెంకటేష్-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: గురుకుల విద్యార్థుల మరణాలను నిరసిస్తూ ఆందోళన చేపట్టిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.వేల్పుకొండ వెంకటేష్ గురువారం డిమాండ్ చేశారు. కలుషిత ఆహారంతో 50 మంది విద్యార్థులు మరణించినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోనందుకు నిరసనగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ముట్టడి, ధర్నా సందర్భంగా అక్రమంగా అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం దుర్మార్గమని గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు ఇతర బీఆర్‌ఎస్వీ నాయకులను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ కోదండరాం దంపతులకు ఘన సన్మానం



ఎమ్మెల్సీ కోదండరాం దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: తార్నాకలోని నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం దంపతులను, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. తార్నాక ప్రాంతం నుంచి ఇద్దరు ప్రజాప్రతినిధులు ఉండటం తమ ప్రాంతానికి ఎంతో గర్వకారణమని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రొ. టి తిరుపతిరావు, అసోసియేషన్ ప్రసిడెంట్ టి.వి.రావు, సెక్రటరీ శేషసాయి పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం, రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని ధర్మ స్టూడెంట్ యూనియన్ (డీఎస్‌యూ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కోకన్వీనర్ సైదాబాబు మాట్లాడుతూ.. స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లలో ఇప్పటి వరకు 50 మంది విద్యార్థులు మరణించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మరణాలపై విచారణ జరిపించి కారకులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో లింగయ్య, శివ, నిఖిల్, మల్లేష్, అశోక్, దుర్గారావు, ప్రఫుల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి

సికింద్రాబాద్: బౌద్ధనగర్ డివిజన్ సంజీవపురంలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని సంజీవపురం తుల్జా భవానీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్ ఎమ్మెల్యేను కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జగదీశ్ మాట్లాడుతూ మరమ్మతుల ద్వారా ఇబ్బందులు తీరడం లేదన్నారు. ఇక్కడ సీవరేజీ లైన్లు మార్చడం మాత్రమే తమ సమస్యకు పరిష్కారం లభించగలదని చెప్పారు. సీవరేజ్ లైన్లు మార్చడంతో పాటు సంజీవపురంలో కొత్తగా ఏర్పాటు చేసిన పవర్ బోర్‌వెల్‌కు మెటర్లు బిగించి తమకు నీటిని అందించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ సంజీవపురంలో కొత్త సీవరేజీ లైన్లు వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన పవర్ బోర్‌వెల్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.

తల్లి, కూతురు అదృశ్యం



అదృశ్యమైన తల్లి, కూతురు

రాంగోపాల్‌పేట్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తల్లీ, కూతురు అదృశ్యమైన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కళాసీగూడకు చెందిన స్వరూప్ దాస్ భార్య వైశాకి దాస్ (25) కుమార్తె నిషిత దాస్ (6)ను తీసుకొని ఈ నెల 26న ఇంట్లో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు తెలిసిన వారి దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'విద్యార్థుల చావులకు ప్రభుత్వానిదే బాధ్యత'

కాచిగూడ: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు సరైన భోజనం లేక ఆకలి చావులు పెరుగుతున్నాయని వారి చావులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరేళ్ల మహేష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్టళ్ల నిర్వహణకు, విద్యార్థుల భోజనాలకు అవసరమైన నిధులను ప్రభుత్వం అందించడంలో పూర్తి విఫలం చెందడం వల్లే విద్యార్థులు చావులు పెరిగాయన్నారు. ఎక్కడ చూసిన ఫుడ్‌పాయిజన్లతో విద్యార్థులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల హాస్టల్ ఫీజులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే శాసన సభ సమావేశాలను వేలాది మంది విద్యార్థులతో అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉదయ్‌కుమార్, ఈర్ల ప్రసాద్, మేడి నాగరాజు, సతీష్ కుమార్, అనిత, మేఘన, అక్షయ, రజిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.